మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి



శిశు గృహంలో వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్, బ్యూరో, మార్చి5 (ప్రభాతవార్త):** స్టేట్ హోం ఆవరణలోని శిశుగృహాన్ని మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి సందర్శించారు. శిశుగృహ చిన్నారులను ఆహ్లాదకర వాతావరణంలో పెరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. శిశుగృహ లో వేస్తున్న పెయింటింగ్, చిన్నారుల కోసం నూతనంగా నిర్మిస్తున్న పార్కు, ఆట వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశుగృహ చిన్నారులకు ఉపయోగపడేలా చిత్రాలు వేయాలని సూచించారు. ప్రతి రోజు పిల్లలని పార్కులో ఆడించాలని తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న చిల్డ్రన్ హోమ్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగంగా నాణ్యవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కి సూచించారు. కార్యక్రమంలో డిడబ్ల్యుఓ. జరీనా బేగం, సిడిపిఓ శైలజ శ్రీ, డిసిపిఓ నర్మద పాల్గొన్నారు.

## చెరువులను అన్యాక్రాంతం కానీయొద్దు

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ముదిరాజ్ పొదుపు సంఘానికి రూ.లక్ష విరాళం
- ముడా నిధులతో ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణం
- ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు
- సంఘం సభ్యులకు ప్రాథమిక మత్స్యకార సహకార సంఘం రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి5 ప్రభాతవార్త:** మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని దివిటిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పడిన ప్రాథమిక మత్స్యకార సహకార సంఘం రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలే కాదు పురుషులు కూడా పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదగవచ్చు అని ముదిరాజ్ సోదరులు పొదుపు సంఘం ఏర్పాటు చేసి నిరూపించారని ఆయన అన్నారు. ముదిరాజ్ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొదుపు సంఘాన్ని ప్రోత్సహించడం కోసం లక్ష రూపాయలు విరాళం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ భవనాన్ని ముడా నిధులతో నిర్మాణం చేస్తామని, అందుకోసం ఎస్టిమేషన్ తయారు చేసి ఇవ్వాలని ఆయన ముదిరాజ్ సంఘం సభ్యులకు సూచించారు. రానున్న రోజుల్లో దివిటిపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని ఆయన చెప్పారు. అందుకే ఈగ్రామాన్ని మున్సిపల్ కార్పొరేషన్‌లో చేర్చడం జరిగిందని ,గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు అరకొరగా వస్తాయని, అదే కార్పొరేషన్‌లో అయితే ప్రతి వార్డుకు అభివృద్ధి పనులకు కోటి రూపాయల వరకు వస్తాయని ఆయన చెప్పారు. చెరువులను అన్యాక్రాంతం కాకుండాకాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని, చెరువుల సంరక్షణ కోసం మైనర్ ఇరిగేషన్ శాఖ ద్వారా అత్యధిక సంఖ్యలో నిధులు తెచ్చి చెరువులుఅభివృద్ధి చేస్తానని ఆయనహామీ ఇచ్చారు. దివిటిపల్లిలో పేదవారికి డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని, ప్రభుత్వం నుంచి సంవత్సరానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు కూడా వస్తాయని, రానున్న నాలుగు సంవత్సరాలలో ఇళ్లులేని ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలోముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గంజి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అనుప ఆంజనేయులు,జె.చంద్రశేఖర్, సిరిగిరి మురళీధర్, కోస్గి శివప్రసాద్ రెడ్డి, చర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాలువ నిర్మాణ పనులను అడ్డుకున్న తాడూరు భూ నిర్వాసితులు



నష్టపరిహారం చెల్లించేంతవరకు పనులు జరగనివ్వమని అడ్డుకున్న తాడూరు భూ నిర్వాసితులు

**ఉప్పునుంతల, మార్చి5 ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద అచ్చంపేట నియోజకవర్గంలోని పులిజాల నుంచి తాడూరు మీదుగా పెనిమెళ్ళ వరకు వెళ్లిన కాలువ నిర్మాణ పనులను బుధవారం మండలంలోని తాడురు గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. తమ పొలాల గుండా కెఎల్ఐ కాలువ తీసుకెళ్లడంతో తమకు నష్టపరిహారం అందించాలని రైతు డిమాండ్ చేశారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని భూసేకరణ అధికారులను, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని, తాము నష్టపోకుండా ఆదుకుంటామని చెప్పిన ప్రజాప్రతినిధులు నేటి వరకు తమకు న్యాయం చేయలేదని వారు ఆగ్రహిస్తూ కాలువ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసేంతవరకు ఊరుకునే పరిస్థితి లేదని భీష్మించు కున్నారు. కాలువలు వస్తే తమకు న్యాయం జరుగుతుందని ఊహించాం కానీ ఇలా నష్టపోతామని ఏనాడు కలలు కనలేదని, తాము నష్టపోయిన నష్టపది గాని చెల్లించకుండా ప్రభుత్వం గాలికి వదిలేయడం సరికాదని వెంటనే తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా తాడూరు గ్రామం చెందిన గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని నిర్మాణ పనులను అడ్డుకున్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేస్తారని వారు కోరారు.

## చిరుత పులి కలకలం



లేగదూడను చంపేసిన చిరుతపులి

**మద్దూర్, మార్చి 5 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని మోమినాపూర్ గ్రామంలో బుధవారం తెల్లవారు జామున అదే గ్రామానికి చెందిన గుల్ల హనుమంతు వ్యవసాయ పొలం దగ్గరబర్రె, దూడను రెండింటిని చంపేసి రక్తం తాగి అక్కడనుంచి వెళ్లిపోయింది. ఉదయం రైతు తన వ్యవసాయ పొలం దగ్గరకి వచ్చి చూడగా బర్రె దూడ బర్రె చనిపోయి ఉండగా చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.ఫారెస్ట్ అధికారి బుధవారం రోజు చిరుత పులిని పట్టుకోవడానికి బోను వ్యవసాయ పొలం దగ్గర అమర్చారు. అలాగే సిసి కెమెరా కూడా పెట్టడం జరిగిందని ఫారెస్ట్ అధికారి తెలిపారు.20 రోజుల నుంచి మండలంలో చిరుత పులులు తిరుగుతున్న అధికారులు ఎక్కడున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. మూగజీవులు చనిపోయిన తర్వాత ఫారెస్ట్ అధికారులు అక్కడికి వచ్చి చూసి వెళ్ళిపోతున్నారు. అంతేకానీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని పలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు జిల్లా ఫారెస్ట్ అధికారులు స్పందించి వెంటనే చిరుత పులులను పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

# నిరంతరం శ్రమిస్తూ.. శిథిలాలను తొలగిస్తూ..

- యుద్ధప్రాతిపదికన డీవాటరింగ్
- బురదను తొలగించేందుకు వాటర్‌జెట్‌ల వినియోగం
- పన్నెండు రోజులైనా దొరకని కార్మికుల ఆచూకీ
- టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్ సహాయక చర్యల పురోగతిపై సమీక్ష







**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి5 ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగి 12రోజులు గడిచినా టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ ఇంకా తెలియరాలేదు.టన్నెల్‌లో కన్వేయర్ బెల్ట్ ను రీస్టార్ట్ చేయడంతో మట్టి తోడివేత పనులు జరుగుతున్నాయి. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) కట్టింగ్ కూడా పూర్తి కావడంతో ప్రొక్లెయిన్‌లతో మట్టి తోడివేత పనులు వేగవంతం చేయనున్నారు. జీపీఆర్ మెషిన్లు ఎనిమిది ప్రాంతాలను గుర్తించగా ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో తవ్వకాలు పూర్తయ్యాయి. మిగతా నాలుగుచోట్ల తవ్వకాలు ప్రారంభించారు. అయితే ఊట నీరు, ఉబికి వస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నది. లోకో ట్రైన్ చివరి ప్రమాదఘటన స్థలానికి వెళ్లేలా చర్యలు వేగవంతం చేస్తున్నారు. ప్రమాద స్థలంలో 8మీటర్ల వరకు బురద మట్టి పేరుకుపోవడంతో మట్టి తొలగింపు మనుషుల ద్వారా చేయడం ఇబ్బందిగా మారింది. అయితే కన్వేయర్ బెల్ట్ రీస్టార్ట్ కావడంతో గంటకు సుమారు 800టన్నుల బురదను బయటకు పంపే చర్యలు జరుగుతున్నాయి.

**డిజాస్టర్ మేనేజ్మెంట్ చీఫ్ సెక్రటరీ, కలెక్టర్ సమీక్ష..**

టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో, సహాయక చర్యలను సమీక్షించేందుకు డిజాస్టర్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ బుధవారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో సహాయక బృందాలు కొనసాగిస్తున్న పనులను విభాగాల వారీగా విశ్లేషించారు. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కల్నల్ పరీక్షిత్ మెహర టన్నెల్ బోరింగ్ మెషిన్ నమూనా తో అధికారులకు టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలను వివరించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ చివరి భాగంలోనీ శిథిలాలను తొలగించడం జరిగిందని, రెస్క్యూ ఆపరేషన్ లో పాల్గొంటున్న సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తూ శిథిలాలను తొలగిస్తూ గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ గుర్తించిన సర్ఫేస్ డిస్టర్బెన్స్ ప్రాంతాలలో మట్టితీత పనులు వేగంగా జరుగుతున్నాయని, వాటరింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతుందని, టన్నెల్ బోరింగ్ మిషన్ ఎడమవైపు నుండి వాటర్ జెట్‌ల ద్వారా బురదను తొలగించే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న సహాయక బృందాలు సమన్వయంతో నిరంతరం శ్రమిస్తున్నాయని వివరించారు. రెస్క్యూ ఆపరేషన్ లో పాల్గొంటున్న సహాయక బృందాలు తోపాటుఢిల్లీ నుండి వచ్చిన నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ ప్రతినిధుల బృందం, టన్నెల్ ప్రమాద ప్రదేశంలో రోబోటిక్ సేవల కొరకు హైదరాబాద్ కు చెందిన విజు రోబోటిక్స్ ప్రతినిధుల బృందం టన్నెల్లోకి వెళ్లినట్లు తెలిపారు. టన్నెల్ బోరింగ్ మిషన్ ఎడమవైపు నుండి వాటర్ జెట్ ల ద్వారా బురదను తొలగించే పనులు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాల ద్వారా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. టన్నెల్‌లో పల ఉన్న టన్నెల్ బోరింగ్ మిషన్ పై పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు వాటర్ జెట్‌లను ఉపయోగించుకున్నట్లు వాటి పని తీరును అధికారులకు డెమో ద్వారా వివరించారు. కన్వేయర్ బెల్టు పునరుద్ధరించామని దానికి సంబంధించిన కమీషనింగ్ పని పూర్తి చేస్తున్నట్లు, రెస్క్యూ ఆపరేషన్ లో ఎదుర్కొంటున్న ఆటంకాలను అధిగమిస్తూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు వివరించారు. టన్నెల్ లోపల వెంటిలేషన్, లైటింగ్ సదుపాయాలను ముందుకు పొడిగించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి, టీఎస్ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్ఎఫ్ అధికారిప్రసన్న, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ, ఎస్డీఆర్ఎఫ్ అధికారి, ఫైర్ సర్వీసెస్, దక్షిణ మధ్య రైల్వే ప్లాస్మా కట్టర్స్, ర్యాట్ మైనర్స్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా లక్నో డైరెక్టర్ అయోధ్య ప్రసాద్ తప్లియాల్,, హైదరాబాదు డైరెక్టర్ శైలేంద్ర కుమార్, దక్షిణ మధ్య రైల్వే డివిజన్ మెకానికల్ ఇంజనీర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

**సహాయక బృందాలకు ప్రత్యేక భోజనం..**

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు (ఎస్ఎల్బీసీ)లో సహాయక చర్యల కై ప్రత్యేకంగా వచ్చిన రెస్క్యూ బృందానికి ప్రత్యేక భోజన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, తెలిపారు. బుధవారం ఎస్ఎల్బీసీ రెస్క్యూ ఆపరేషన్లో చేపడుతున్న పనులను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ... గత 12 రోజులుగా రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న అధికారులకు,సహాయక బృందాలకు నిరంతరాయంగా భోజనం కల్పిస్తున్న అధికారులతో, సహాయక బృందాలకు అందిస్తున్న ఆహారం విషయంపై సహాయక బృంద సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సహాయక సిబ్బందికి అందిస్తున్న ఆహారం నాణ్యత, పోషక విలువలను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందిస్తున్నట్లు, సహాయక చర్యల్లో పాల్గొంటున్న రెస్క్యూ టీమ్ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం,రాత్రివేళల్లో భోజన సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. టన్నెల్ పనులను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, రెస్క్యూటీమ్ ఆపరేషన్ సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక బృందాలకు డీటీడీఓ అధికారి ఫిరంగి,ఆధ్వర్యంలో చేసిన వంటకాలను, భోజన సదుపాయాలను కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రత్యేకంగా పర్యవేక్షించి నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, అధికారులు,సహాయక బృందాలతో కలిసి అక్కడే భోజనం చేశారు.



సహాయక బృందాలతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా అధికారులు

# పాలమూరును నెంబర్ వన్‌గా నిలపాలి

- క్షేత్ర స్థాయికి కేంద్ర పథకాలు చేరాలి
- ఆ దిశగా ప్రజల్లో చైతన్యం నింపాలి
- అధికారులకు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆదేశం
- కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఎమ్మెల్యే యెన్నంతో కలిసి సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 5, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతిఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా..క్షేత్రస్థాయి వరకు కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సూచించారు. మహబూబ్ నగర్ జెడ్పీ మీటింగ్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఎంపీ డికె.అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలోని లబ్ధిదారుల, ప్రజలు పీఎంఎఫ్ఎంఈ, విశ్వకర్మ పథకం, ఎన్ఆర్ఈజీఎస్ కింద గొర్రెలు, కొల్ల పెంపకం, డైరీ ఫామ్స్, (ఫిషరీస్) మత్స్య శాఖలో ప్రోత్సాహకాలు, టెక్స్టైల్స్, ట్రైబల్ వెల్ఫేర్, పీఎంఎఫ్ఎంఈ పథకాల అమలు తీరు, మార్గదర్శకాలను అధికారులు వివరించారు. పార్లమెంట్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు విశ్వకర్మ యోజన పథకం మార్గదర్శకాలు, అప్లై చేసుకునే విధానంపై కీలక చర్చలు జరిగాయి.. క్షేత్ర స్థాయిలో...,బ్యాంకుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, అప్లికేషన్స్ లో సమస్యలను ఎంపీ డికె అరుణ ఆధ్వర్యంలో లబ్ధిదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను నోట్ చేసుకుని అనంతరం సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. బ్యాంకర్ల పరిమితులు, నిబంధనలపై ఎంపీ డికె.అరుణ అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత వరకు అర్హులందరికీ లోన్స్ ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేసేలా చూడాలని సూచించారు.కుల వృత్తులకు ప్రోత్సాహకం ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. విశ్వకర్మ యోజన కింద మొత్తం 18 రకాల శిక్షణలు ఇవ్వొచ్చని ఆ దిశగా అధికారులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు.స్వయం ఉపాధి కల్పనేవిశ్వకర్మ యోజన పథకం లక్ష్యమన్నారు. ప్రస్తుత మార్కెట్ కు తగ్గట్లుగా ప్రజలు, యువకుల్లో అవగాహన కల్పించి ఆ దిశగా శిక్షణ ఇచ్చి లోన్స్ ఇప్పించాలి ప్రతి మధ్యతరగతి వ్యక్తి ఆర్థిక ప్రగతి సాధించాలన్నదే ప్రధాని మోడీ లక్ష్యం అన్నారు.



ఎంపీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

**బ్యాంకర్లు నిర్లక్ష్యం చేయొద్దు : ఎంపీ డీకే అరుణ**

సెంట్రల్ స్కీమ్స్ ఫలాలు... క్షేత్ర స్థాయికి చేరాలి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజా అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ, ప్రధాని మోడీ లక్ష్యం అని స్పష్టం చేశారు. సబ్సిడీతో కూడుకున్న అన్ని స్కీమ్స్ క్షేత్రస్థాయికి చేరాలన్నారు. అన్ని వర్గాలు అభివృద్ధి చెందితేనే దేశ అభివృద్ధి అని నమ్మిన నాయకుడు మోడీ అన్నారు. 18 కుల, చేతి వృత్తులకు విశ్వకర్మ యోజన ద్వారా శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధికి రూ.10 లక్షల వరకు లోన్స్ ఇస్తున్నారని, విశ్వకర్మ యోజన పథకం క్షేత్ర స్థాయిలో మరింత అమలు కావాలన్నారు. ఔత్సాహికులకు శిక్షణ ఇప్పించడంలో జిల్లా అధికారులు దృష్టి పెట్టాలని, వచ్చిన దరఖాస్తుల విషయంలో బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యంచేయొద్దన్నారు. బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యంతో విశ్వకర్మ పథకం లక్ష్యం నీరుగారే అవకాశం ఉన్నదన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు కేంద్రప్రభుత్వ పతకంపై అవగాహన కల్పించేందుకే ఈ అవగాహన సదస్సు నిర్వహించామని, అవగాహన సదస్సు కు సహకరించి అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రమాదాలను నివారించాలి

- వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ఎలక్ట్రిక్ వాహనాలకు టాక్స్, రిజిస్ట్రేషన్ మినహాయింపు
- రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్,సహకార శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 5 ప్రభాతవార్త:** జిల్లాలో రహదారులపై ప్రమాదాల నివారణకు వివిధ శాఖలు సమన్వయంతో భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, సహకార శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకితో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌బి శాఖల అధికారులతో జిల్లాలో రహదారి ప్రమాచాల నివారణకు తీసుకుంటున్న చర్యల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించి ఎప్పటి కప్పుడు జిల్లాలో ప్రమాదాలు జరిగే రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్,ఎస్.పి,అర్ బి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ కమిషనర్ మాట్లాడుతూ రహదారి భద్రత పై సుప్రీం కోర్టు కమిటీ నియమించినట్లు తెలిపారు జిల్లాల్లో రహదారి భద్రత పై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలు సమావేశాలు నిర్వహించి తీసుకున్న చర్యలపై పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌బి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం నివేదికలు సమర్పించాలని అన్నారు.సుప్రీం కోర్టు కమిటీ కి నివేదిక సమర్పించ వలసి ఉంటుంది. కనుక ఈ అంశం అత్యంత ప్రాధాన్యత నివ్వాలని అన్నారు.గత సంవత్సరం జిల్లాలో 108 రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు డేటా ఉందని, ఆయా శాఖలు డేటా అప్లోడ్ చేయాలని సూచించారు. ముఖ్యంగా యువత 19 సంవత్సరాల నుండి 35 సంవత్సరం మధ్య ఉన్న వారు ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, 18.2 శాతం ఉన్నారని వెల్లడించారు. పాఠశాలల విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలపైఅవగాహన కలిగించాలని అన్నారు.ట్రాఫిక్ అవగాహన పార్క్ లు ఏర్పాటు చేసి పాఠశాలల విద్యార్థులకు అవగాహన కలిగించాలని అన్నారు. యూనిసెఫ్, ఎన్‌జిఓలు శిక్షణా మాడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా పాఠశాలల హెడ్ మాస్టర్‌లను సమన్వయం చేసుకొని శిక్షణ, అవగాహన కార్యక్రమాలు –మిగతా4లో..

## ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం పూర్తి చేయాలి

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, మార్చి 5 ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలోని 16 రకాల యూనిట్ల గ్రౌండింగ్ వంద శాతం పూర్తి చేసి, లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్లో జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ అధికారులతో మహిళా శక్తి పథకం యూనిట్ల లక్ష్యం, బ్యాంక్ లింకేజీ రుణాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ మహిళల్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలోని 16 రకాల యూనిట్ల గ్రౌండింగ్ 100శాతం పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.ఈ నెలాఖరులోపు ఇందిరా మహిళా శక్తి పథకం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలకు బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.30 కోట్ల లక్ష్యాన్ని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నా రు. అదేవిధంగా, మహిళా శక్తి కార్యక్రమంలోభాగంగా గ్రూప్ యూనిట్లు అదేవిధంగా వ్యక్తిగత యూనిట్లు సంబంధిత బ్యాంకు వారి సహకారంతో మంజూరు చేయించి లక్ష్యాన్ని పూర్తి చేయాల న్నారు. సమావేశంలో డిఆర్‌డిఓ ఉమాదేవి, డీపీఎం భాషా నాయక్, ఏఎల్డిఎం సాయి పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

● పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు

**వనపర్తి టౌన్, మార్చి 5 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు సూచించారు.బుధవారం పానగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును, పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

## పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్, డిఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీపివాస్

**గద్వాల, మార్చి5 ప్రభాతవార్త :** బుధవారం నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా జిల్లా కేంద్రం లోని పరీక్షా కేంద్రాలు జ్ఞాన ప్రభ, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలలను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు సందర్శించారు. అందులో భాగంగానే ఆయా కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఎస్పికి వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులలో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి భద్రత ఏర్పాట్లు, పరీక్షా అనంతరం ఎస్కార్ట్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పి తెలిపారు. ఈ సందర్శనలో డిఎస్పి వై.మొగిలయ్య, సాయుధ దళ డి.ఎస్పి నరేందర్ రావు, గద్వాల్ సిఐ టి.శ్రీను, గద్వాల్ టౌన్ ఎస్సై కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పాలన దినోత్సవం



విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

**పెబ్బేరు, మార్చి 5 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణ కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో బుధవారం విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠ్యాంశాలు బోధించారు. 34 మంది పిల్లలు వివిధ పాఠ్యాంశాలను బోధించి అల్లరింపజేశారు. కలెక్టర్‌గా సానియా, డిఈఓగా కీర్తన,ఎంఈఓగా కీర్తి కుమార్ రెడ్డి, హెచ్ఎంగా అయేషా వ్యవహరించారు. ఉపాధ్యాయులుగా ముర్తుజావలి, దశరథం, భాను ప్రసాద్ ,నందిని నవ్య, అశోక్ ,జయకుమార్ ,మల్లేష్, చరణ్ కృష్ణ, జనార్ధన్, గాయత్రి తదితర విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు.పాఠంశాలు మంచిగా బోధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఏ.విష్ణువర్ధన్ రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులైన విద్యార్థులను అభినందించారు. తరగతి గది ఎంతో ఉన్నతమైనదని విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహ సంబంధం పరిఢవిల్లినప్పుడే పాఠ్యాంశం సఫలీకృతమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్‌ఉపాధ్యాయులు రంగారెడ్డి,శ్రీవిద్య,నరసింహగౌడ్,సుదర్శన్,డి కృష్ణయ్య, ఇంద్రారావు,అరుణ,నాగమణి,బీసన్న,ప్రసన్నకుమారి, నరసింహ, కురుమయ్య, మౌనిక, మన్నెమ్మ, షర్మిష్టదేవి వాణిశ్రీ, బి సాయిగీత, వాణిశ్రీ ,జయ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ తొలగించాలి ఎమ్మార్పీఎస్ వినతి



డంపింగ్ యార్డ్ తరలించాలంటూ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఆత్మకూరు, మార్చి 5 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని 5వ వార్డులోని ఇంద్రానగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ తొలగించి దళితులకు రక్షణ కల్పించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం రోజు ఆత్మకూర్ తహశీల్దార్ చాంద్ పాషాను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇంద్రానగర్ లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి పట్టణంలోని చెత్తాచెదారాన్ని అక్కడికి తరలించి పెద్ద ఎత్తున నిలువ చేయడంతో దుర్గంధం వెదజల్లే కాలనీలోని దళిత వాడకు తీవ్ర దుర్వాసన మీద తేలడమే కాకుండా కాలనీవాసులు పలు అనారోగ్యాలకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గడచిన కొన్ని రోజులుగా ఇంద్రానగర్‌లోని డంపింగ్ యార్డును తొలగించాలంటూ ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ కు, ఇతర ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆత్మకూర్ తహశీల్దార్ స్పందించి ఇంద్రానగర్ లోని డంపింగ్ యార్డ్ తొలగించి దళితుల ఆరోగ్యాన్ని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆత్మకూరు మండల అధ్యక్షుడు మాసన్న ,అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జానకిరాములు, సోంబాబు, దండు శ్రీనివాసులు, బోరెల్లి రాము తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబానికి కార్పస్ ఫండ్, ఫ్లాగ్ ఫండ్ చెక్‌లను అందజేసిన జిల్లా ఎస్పీ



బాధితులకు చెక్కును అందిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

**గద్వాల,మార్చి5 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మరణించిన పోలీస్ అధికారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు బుధవారం కార్పస్ ఫండ్ క్రింద 50,000/- రూపాయల చెక్ ను, ఫ్లాగ్ ఫండ్ క్రింద 10,000/- రూపాయాల చెక్ ను అందజేసారు. జిల్లా పరిధిలోని కేటీ దొడ్డి పోలీస్ స్టేషన్ లో మహిళ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కుమారి శ్రావణి గత సంవత్సరం సెప్టెంబరు నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించగా వారి తల్లీదండ్రులు ఇంద్రమ్మ, ఈశ్వరయ్యలకు కార్పస్ ఫండ్ క్రింద 50,000/- రూపాయాల చెక్ ను, ఫ్లాగ్ ఫండ్ క్రింద 10,000/- రూపాయా ల చెక్‌ను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారి కుటుంబ స్థితి గతులను తెలుసుకొని మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణించిన పోలీస్ కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తామని అన్నారు. వారి కుటుంబానికి రావాల్సిన మిగిలిన బెనిఫిట్స్ అన్ని కూడా త్వరగా వచ్చేందుకు కృషి చేయాలని కార్యాలయ ఏ ఓ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏ.ఓ సతీష్, సూపరింటెండెంట్ నాగేంద్రం పాల్గొన్నారు.

## గార్లపాడు గ్రామాన్ని వెంటనే మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



నిరసన చేపడుతున్న ఉద్యమకారులు

**కోయిలకొండ,మార్చి5 ప్రభాతవార్త:** మండలంలోని గార్లపాడుగ్రామాన్ని వెంటనే నూతన మండలంగా ప్రకటించాలని మండల సాధన సమితి జేఏసీ కో కన్వీనర్ వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం కోసం జరుగుతున్న ఉద్యమానికి బుధవారం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు గార్లపాడు గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలన్నారు. గార్లపాడు గ్రామం మండలంగా కావాలని గార్లపాడు గ్రామ చుట్టూ గ్రామాల ప్రజలు ఉద్యమానికి ప్రతినిత్యం మద్దతు తెలపడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి గార్లపాడు గ్రామాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోపు మండలంగా ప్రకటింపచేయాలని ఆయన ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి నేతలు పాల్గొన్నారు.

## బాధితురాలికి మాజీ మంత్రి సింగిరెడ్డి పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి

**పానుగల్,మార్చి5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు మిద్దె.రమేష్ భార్య సుజాత ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడగా వనపర్తి జిల్లా కేంద్రంలోని సుధా నర్సింగ్ హోమ్ నందు చికిత్స పొందుతుంది సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి సుజాతను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ పగిడాల శ్రీనివాస్ ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పరామర్శించిన వారిలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వెంట నందిమల్ల అశోక్, చంద్రశేఖర్ నాయక్, మిద్దె.కృష్ణ, వీరసాగర్ తదితరులు ఉన్నారు.

# అత్యంత పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ పి అమరేందర్

- పది పరీక్షల నిర్వహణలో పూర్తి స్థాయి బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లదే : డీఈఓ ఏ.రమేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పి అమరేందర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 05 ప్రభాతవార్త:** పదవ తరగతి వార్షిక పరీక్షలు మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా, జిల్లాలో అత్యంత జాగ్రత్తగా పకడ్బందీగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.అమరేందర్ అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటు అధికారుల సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ పి.అమరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1230 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష హాలులోకి విద్యార్థులను నిశితగా పరిశీలన చేసి పంపించాలని తెలిపారు. పరీక్ష హాలులోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గూడ్స్, గడియారాలు అనుమతించకూడదని తెలిపారు. బయటి వ్యక్తులను ఎవరిని కూడా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని తెలిపారు. పరీక్ష ప్రశ్న పత్రాలను పోలీసు స్టేషన్ నుండి సరఫరా చేయడం జరుగుతుందని, కేంద్రాల్లో సూపరింటెండెంట్ గదిలో ఏర్పాటు చేసిన సిసి టివి ముందు ప్రశ్న పత్రాలను నిర్ణీత సమయంలోనే ఓపెన్ చేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ అనంతరం ఏ రోజుకారోజు జవాబు పత్రాలను పోస్టాఫీసుకు పంపించాలని, పరీక్షల విధులను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు గాలి, వెలుతురు పుష్కలంగా వెలువడేలా చూసుకోవాలి, అన్ని ఏర్పాట్లు పక్కగా ఉండాలని ఆదేశించారు. గత పదో తరగతి పరీక్షల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో 21వ ఉత్తీర్ణత స్థానంలో ఉందని, ఈ సారి పరీక్షలో జిల్లాను రాష్ట్ర స్థాయి ఉత్తీర్ణతలో 10వ స్థానంలోపే వచ్చేలా కృషి చేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి అమరేందర్ కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ మాట్లాడుతూ.... పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో చీఫ్ సూపరింటెండెంట్లు ప్రధాన బాధ్యత వహించాలని, ఉదాసీనతకు వీల్లేదని నాగర్‌కర్నూల్ డీఈఓ రమేష్ కుమార్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మార్చి 21 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. వార్షిక పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు ఎలాంటి అలసత్వం కానీ, ఉదాసీనతకు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిలో మొత్తం 10598 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాలు తరలించడం, వాటిని పరీక్ష కేంద్రంలో లెక్క ప్రకారం తీసుకోవడం, తిరిగి సమాధాన పత్రాలను పోస్టు ద్వారా పంపే వరకు చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలో మాత్రమే ప్రశ్న పత్రాలను తెరవాలని చెప్పారు. సంబంధిత కేంద్రాలకు చెందిన ప్రశ్నపత్రాల కోడ్‌ను జాగ్రత్తగా సరి చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలోకి ఏ ఒక్కరు కూడా సెల్ ఫోన్ తీసుకురాకుండా పూర్తిస్థాయి పర్యవేక్షణ బాధ్యతను చీఫ్ సూపరింటెండెంట్‌లే తీసుకోవాలని సూచించారు. పరీక్షలకు ఇంకా 15రోజుల సమయం మిగిలి ఉందని, అప్పటి వరకు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టెన్ జీపీఎస్ సాధించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, నోడల్ అధికారి కుర్మయ్య, సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, వెంకటయ్య, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పులిజాల పరశురాములు



సమావేశంలో మాట్లాడుతున్న పులిజాల పరశురాములు

**కల్వకుర్తి, మార్చి 05 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై ముఖ్యమంత్రి మోము వీడాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తక్షణమే అంబేద్కర్ అభయాస్తం మార్గదర్శకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ మాసం పూర్తిగా పూలే అంబేద్కర్‌కు సంబంధించినదని చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా ఏడాదికి 750కోట్ల చొప్పున కేటాయిస్తామని రైతుబంధు, రైతు భీమా వసతి కల్పిస్తామని, దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములకు హక్కు పత్రాలు ఇస్తామని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది ఇంతవరకు ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు దళిత బంధు స్థానంలో అంబేద్కర్ అభయహస్తం పేరిట 12 లక్షలు ఇస్తామని ఇంతవరకు అమలు చేయడం లేదని ఆయన అన్నారు. 2018 సంవత్సరం నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వడం లేదని తక్షణమే గ్రౌండ్ చేసిన రుణాలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏప్రిల్ మాసంలో పూర్తిగా మహనీయుల మాసంగా ప్రకటించి రాష్ట్ర జిల్లా వ్యాప్తంగా కుల వివక్ష అంటరానితనం ఏ గ్రామంలో ఉన్న అధ్యయనం చేసి ప్రత్యక్ష ప్రతిఘటు ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి చెందిన నేటికీ కుల వివక్ష అంటరాని తనము కొనసాగించడం సిగ్గుచేటు అని అన్నారు. 11 నెలల క్రితం దళితుల కోసం ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.అంతర్జాతీయ మహిళాదినోత్సవ సందర్భంగా దళిత మహిళలు వారి హక్కులు అనే అంశంపై సెమినార్లు జిల్లా వ్యాప్తంగా మార్చి8న నిర్వహిస్తామన్నారు.ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పులిజాల అశోక్, కెవిపిఎస్ మండల నాయకులు ముద్రమల్ల చంద్రయ్య, వింజమూరు డేవిడ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బొల్లె జగన్, కల్వకుర్తి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలి

- విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో బహుజనుల వాటా తేల్చాలి
- ఎస్ఎల్బీసీ ఘటనలో ప్రభుత్వం విఫలమైంది
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ

**కల్వకుర్తి,మార్చి05 ప్రభాతవార్త:** ఎస్సీ,ఎస్టీ, బీసీ బహుజన వర్గాలు రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో మహోన్నత ఉద్యమాన్ని చేసి చూపుతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి చెరుకు మణికంఠ, ఓయూ జేఏసీ చైర్మన్ రాజు నేతలు పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని టీఎస్ యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్య ఉపాధి ఉద్యోగ అవకాశాల్లో బీసీల వాటా తేల్చాలని వారు డిమాండ్ చేశారు. ఎస్ఎల్బీసీ సంఘటన జరిగి పది రోజులు దాటిన టన్నెల్లో చిక్కుకున్న వారిని బయటకి తీసే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు దుయ్యబట్టారు. ఏళ్ల కింద ప్రారంభించిన ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులు నేటికీ పూర్తి కాకపోవడం పట్ల వారు విచారం వ్యక్తం చేస్తూ పాలమూరు జిల్లాపై పాలకులకు చిత్తశుద్ధి లేదని వారు ఎద్దేవా చేశారు. కులగణన పూర్తిగా తప్పులతడగా నమోదు చేశారని పేర్కొంటూ ఇటీవల ప్రభుత్వం చేసిన సర్వేతో ఎస్సీ, ఎస్టీ బీసీలు తీవ్రంగా నష్టపోయారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందు వరసలో ఉండి బలిదానాలు చేసింది ఎస్సీ ఎస్టీ బీసీ బిడ్డలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ సంక్షేమ సంఘం ముందుకు సాగుతుందని ఆయన సందర్భంగా పేర్కొన్నారు. రాజకీయాల్లో బీసీ వాటా తేల్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నేత జగన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రనాయకులు మల్లేష్, పెద్దయాదవ్, బీసీ సబ్ ప్లాన్ సాధన అధ్యక్షుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు సిబ్బందిని అభినందించిన కమిషనర్



బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్న కమిషనర్

**ఉప్పునుంతల, మార్చి 5 ప్రభాతవార్త :** రైతులకు సకాలంలో రుణాలు అందజేసి, బ్యాంక్ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేసిన సహకార బ్యాంక్ సిబ్బందిని రాష్ట్ర సహకార శాఖ, మార్కెటింగ్ శాఖ, ట్రాన్స్పోర్ట్ శాఖ కమిషనర్ సురేంద మోహన్ అభినందించారు. బుధవారం బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు అందించిన సేవలపై అభివృద్ధి నివేదిక అంద జేయడంలో సఫలీ కృతులు అయ్యారు. కమిషనర్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. బ్యాంకు రుణాలు అందించే వరకే కాకుండా రుణాలను రికవరీ చేయడంలో మొదటి స్థానంలో నిలిచారని, రైతులకు అవగాహన కల్పిస్తూ బ్యాంకు సిబ్బంది చైర్మన్ సహకారంతో పాలక మండలి సమన్వయంతో ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకొని రాష్ట్రంలోనే ఉప్పునుంతల సహకార బ్యాంకు ఆదర్శంగా నిలిచారని బ్యాంకు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. రైతులు వచ్చినప్పుడు వారికి కావలసిన రుణాలు అందజేయడంతో పాటు బ్యాంకు అందిస్తున్న సేవల పట్ల వారికి అవగాహన కల్పించి బ్యాంక్ అభివృద్ధికి కృషి చేసిన డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్‌రావు భవిష్యత్తులో బ్యాంక్ అభివృద్ధి కోసం కావలసిన వనరులను ఎంచుకొని నివేదిక సమర్పించాలని కమిషనర్ సూచించారు. రాష్ట్రంలోనే బ్యాంకు నిర్మాణం, బ్యాంకుల లావాదేవీలు, సహకార బ్యాంకు పెంచుకున్న వనరుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉప్పునుంతల సహకార బ్యాంకుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఈఓ ఛాంబర్‌లో సహకార బ్యాంకులో తీసుకున్న రైతుల వివరాలు, రికవరీ, సహకార సంఘం బ్యాంకు పరిధిలో చేస్తున్న వ్యాపారం పట్ల ఆరా తీశారు. అనంతరం అచ్చంపేట, ఉప్పునుంతల మార్గంలో ఉన్న గోదాం వద్ద వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు సవ్యంగానే కొనసాగుతాయని రైతులు నాణ్యమైన వేరుశనగ తీసుకొచ్చి ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరను పొందాలని కమిషనర్ రైతులకు అవగాహన కల్పించారు. కమిషనర్ తో పాటు డిసిసిబి డైరెక్టర్ సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు, సంఘ సిఇఓ కొత్త రవీందర్ రావు, బ్యాంకు సిబ్బంది మల్లయ్య గౌడు, శేఖర్ రెడ్డి, శంకర్, వెంకట్ రాములు, రజిత, శోభ, కాశన్న, రాముడు, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

## ప్రోత్సాహం ఉంటే విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారు

సి.వి.రామన్ ట్యాలెంట్ స్కూల్ వైద్య విజ్ఞాన ప్రదర్శలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



ప్రదర్శనలను తిలకిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి రూరల్, మార్చి 5 ప్రభాతవార్త:** సి.వి రామన్ టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ డా. మురళీధర్ ఆధ్వర్యములో నిర్వహించిన వైద్య విజ్ఞాన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వైద్య విజ్ఞాన ప్రదర్శన ప్రారంభించి విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. తెలంగాణ సంస్కృతులను, వృత్తి నైపుణ్యాలను, ఆధునిక కాలంలో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న పలు అంశాలను విద్యార్థులు కన్నులకు కట్టినట్లు రూపొందించారు.విద్యార్థుల సృజనాత్మకతను చూసి మాజీ మంత్రి మురిసిపోయారు. శ్రద్ధగా ప్రదర్శన చూసి వివిధ విభాగాలలో విద్యార్థులు రూపొందించిన అంశాలను చూసి వారిని అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించి వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారు అని కొనియాడారు.ఇంత గొప్పగా వైద్య విజ్ఞాన ప్రదర్శన నిర్వహించిన స్కూల్ యాజమాన్యాన్ని, అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలోనిరంజన్ రెడ్డితో పాటు వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, కంచ రవి, శివ,లక్ష్మణ్ స్కూల్ కరస్పాండెంట్ డా. మురళీధర్,డా. శారద, డా. హరికృష్ణ, డా. ప్రత్యూష, డా. సిద్ధార్థ, డా. మోనిక, సత్తార్,నవీన్ కుమార్, షబానా, జనజ్వాల రాధాకృష్ణ,గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మొదటిరోజు ప్రశాంతంగా పరీక్షలు

**7 కేంద్రాల్లో పరీక్ష రాసిన 1612 మంది విద్యార్థులు**

**60 మంది విద్యార్థులు గైర్హాజరు**



పరీక్ష రాసిన అనంతరం విద్యార్థినులు

**కల్వకుర్తి, మార్చి 5 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, న్యూఎరా కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాల, వైఆర్ఎం కళాశాలతో పాటు మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, మహాత్మ జ్యోతిబాపూలే ఊరుకొండ, గిరిజన గురుకుల పాఠశాల కలుపుకొని 7 సెంటర్లలో 1672 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేశారు. మొదటిరోజు 60 మంది విద్యార్థులు గైరాజరయ్యారని పరీక్షల ఎగ్జామ్స్ చీఫ్ సూపర్డెంట్ రామ్ రెడ్డి, ఎగ్జామినేషన్ కస్టోడియన్స్ వేణు, విజయలక్ష్మి, పేర్కొన్నారు. మొదటి రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటన లేకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని వారు వారన్నారు.

## ఘనంగా స్వయం పాలన దినోత్సవం



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**గద్వాల, మార్చి 5 ప్రభాతవార్త :** ఆలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకోవడం జరిగింది. జిల్లా కలెక్టర్‌గా డి.రాజేశ్వరి, జిల్లా విద్యాధికారిగా అఖిలమండల విద్యాధికారిగా ప్రణీత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా కే.విజయకుమార్ వ్యవహరించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి వీ.నల్లా రెడ్డి హాజరై విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థుల ఉపాధ్యాయులు రామన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపించిన సిబ్బంది**

**పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మార్వో లక్ష్మి**



పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపిస్తున్న సిబ్బంది

**పెబ్బేరు, మార్చి 5 ప్రభాతవార్త :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రోజు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పరీక్ష మొదలయ్యే సమయానికి విద్యార్థులను హాల్ టికెట్స్ చెక్ చేసి, గడియారం, సెల్ ఫోన్స్, పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదని తెలియజేయడంతో ఒక్కొక్క విద్యార్థిని చెకింగ్ చేసి లోపలికి పంపించారు. ఈ కేంద్రంలో జూనియర్ కాలేజీ విద్యార్థులు, మోడల్ కాలేజీ విద్యార్థులు, ఒకేషనల్ కాలేజీ విద్యార్థులు మొత్తం 327 మంది విద్యార్థులు ఉన్నారని దీనిలో 321 హాజరయ్యారని 6 మంది గైరాజరయ్యారని ఎగ్జామ్ సెంటర్ నిర్వాహకులు హనుమంత్ రెడ్డి తెలియజేశారు. పరీక్ష కేంద్రాన్ని స్థానిక ఎమ్మార్వో లక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు.

## ప్రతి చిన్నారికి టీకాలు తప్పనిసరిగా వేయించాలి

**పానుగల్,మార్చి5 ప్రభాతవార్త:** గ్రామాల్లో ప్రతి చిన్నారికి క్రమం తప్పకుండా టీకాలువేయడం తప్పనిసరి అని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి తారా శశాంక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్యలు అన్నారు.బుధవారం మండలపరిధిలోని తెల్లరాళ్ళపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రెగ్యులర్ ఇమ్యూనైజేషన్ సెషన్ సైట్‌ను వారు అకస్మాత్తుగా సందర్శించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో వచ్చే అంటు వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చున్నారు. గర్భిణీ స్త్రీలు సరైన సమయంలో మొదటి, రెండవ డోసెస్ టి.టి. వ్యాక్సినేషన్ చేయించుకోవాలని తెలిపారు. మంచి పోషకాహారం తీసుకోవాలని, తల్లి పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధతీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఏఎన్ఎంసరళ,ఆశ కార్యకర్తలక్ష్మి,గర్భిణీస్త్రీలు, పాల్గొన్నారు.

## పసి బాలుడి వేదనకు స్పందించిన పోలీసు

**సవతి తల్లి వేధింపులతో పోలీసులను ఆశ్రయించిన బాలుడు**



బాలుడిని ఓదారుస్తూ వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

**వనపర్తి క్రైమ్, మార్చి5 ప్రభాతవార్త:** పసి బాలుడి వేదనను పోలీసు హృదయం ప్రేమతో ఆదరించి అక్కున చేర్చుకున్న ఘటన వనపర్తిజిల్లాలో వెలుగులోకి వచ్చింది. సవతి తల్లి పెట్టే బాధలను మనసు నుండి బయటికి రానీయకుండా భరిస్తున్న ఒక బాలుడిని వనపర్తి జిల్లా రావుల గిరిధర్ చేరదీసి అతని భద్రతకు భరోసా కల్పించారు. వివరాల్లోకి వెళితే పెబ్బేరు మండలం సూగూరు గ్రామానికి చెందిన గొల్ల నరసింహ వనితల కుమారుడు (9) వనిత అనారోగ్యంతో రెండేళ్ల కిందట మరణించగా పెద్దల బలవంతంపై నరసింహకు సమీప బంధువైన లక్ష్మిని రెండవ పెళ్లి చేసుకున్నాడు. పెళ్ళైన కొత్తలో లక్ష్మి బాలున్ని బాగానే చూసుకునేది. కాలం గడిచేకొద్దీ కక్షసాదింపుకు పాల్పడడం ప్రారంభించింది. చీటికీ మాటికి ఎవరులేని సమయంలో శారీరకంగా చిత్ర హింసలకు గురిచేస్తూ నరకం చూపడం మొదలు పెట్టింది. ఏదో ఒక సాకుతో చిన్న విషయానికి చాటు మాటుగా తిట్టడం కొట్టడం అతని సవతి తల్లి శారీరకంగా హింస పెడుతూ అతనికి నిప్పులో కాల్చిన సలాకితో అతని తొడలు కాల్చింది. ఆ విషయం ఆ బాలుడు తండ్రికి చెప్పినా ఆమె అరాచకానికి అడ్డుకట్ట వేయలేకపోయాడు. మంగళవారం రోజు బాలుడిని అకారణంగా ఆమె చితకబాదగా ఆ విషయాన్ని ఆ అబ్బాయి తన మేనమామ రామచంద్రయ్యకు ఫోన్ ద్వారా తెలిపాడు. రామచంద్రయ్య బాలుని తీసుకొని జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నాడు. ఆ అబ్బాయికి సంబంధించిన వివరాలు రామచంద్రయ్య ఎస్పీకి వివరించాడు. దెబ్బలను గుర్తుకు తెచ్చుకుని ఏడుస్తున్న బాలున్ని ఎస్పీ రావుల గిరిధర్ చేరదీసి అల్పాహారాన్ని అందజేసి ఊరడించారు. అనంతరం ఎస్పీ తనతో పాటు నివాస గృహానికి తీసుకెళ్లి భోజనం చేయించి కొద్దిసేపటి తర్వాత అతని ద్వారా జరిగిన సమాచారమంతా రాబట్టారు. సవతి తల్లి పెడుతున్న బాధలను ,ఆ పసి హృదయం భరించిన తీరును విన్న ఎస్పీ చలించి పోయారు. వెంటనే ఆ అబ్బాయిని జిల్లా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లాఅధికారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ల ద్వారా బాలుడు ఎదుర్కొన్న మనోవేదనను, చిత్రహింసల వివరాలను సేకరించాలని వారిని కోరారు. వారి నివేదిక ఆధారంగా నిందితురాలిపై పెబ్బేరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకున్నారు. బాలుడిని జిల్లాలోని ఏదేని పాఠశాలలో చేర్పిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

## ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

**వెల్దండ, మార్చి 5 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు పరీక్షకు మొత్తం 163 మంది విద్యార్థుల గాను 160 మంది విద్యార్థులు పరీక్ష హాజరు కాగా, 3 విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా పరీక్షల నిర్వహణ స్క్వాడ్ మెంబర్ సుప్రజ, డిటి కిరణ్ కుమార్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 162 మంది విద్యార్థులకు 140 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర పరీక్షకు 183 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ప్రిన్సిపాల్ గోపాల్ రావు తెలిపారు. అదేవిధంగా మోడల్ పాఠశాలలో ద్వితీయ సంవత్సరానికి 141 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఉదయం 8:30 నిమిషాలకి సమయానికి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఆయా కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

**నారాయణపేట టౌన్, మార్చి 5 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు ప్రారంభం సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రం లోనీ శ్రీ సాయి జూనియర్ కాలేజ్, ఉట్కూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలన్ని డిఎస్పి నల్లపు లింగయ్య సందర్శించి అక్కడ విధులలో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పరీక్ష మొదలు నుండి పరీక్ష పేపర్లు వెళ్లే వరకు పోలీసు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. డీఎస్పీతో పాటు టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు, ఉట్కూర్ ఎస్సై కృష్ణంరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## నిఘా నడుమ కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

**పానుగల్, మార్చి 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మొదటి రోజు జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు సుదర్శన్ రెడ్డి డిపార్ట్మెంటల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటి రోజు నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 92 మంది విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు అయినట్లు వారు తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీలు జరగకుండా ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరాలు నిజాలను పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నయన్నారు, అదేవిధంగా పరీక్షల్లో విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముందస్తుగానే వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాగా మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు వారు తెలిపారు.

## మోడల్ హౌస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**బాలానగర్ మార్చి 5 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి శంకుస్థాపన చేశారు. తమ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని, నిరంతరం ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని అన్నారు. ప్రజలు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ అవగాహన కొరకు ఈ మోడల్ హౌస్ నిర్మాణం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ విజయ కుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ అశ్విని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ నాయక్, ఓబీసీ జిల్లా చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, హరిసింగ్, రాజేశ్వర్ రెడ్డి, నందీశ్వర్, అరుణ్ కుమార్, వెంకట్ నాయక్, పుట్టల మహేష్ తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు జరిపిస్తే చర్యలు తీసుకుంటాం

**ఖిల్లాఘణపురం, మార్చి 5 ప్రభాతవార్త :** బాల్య వివాహాలు జరిపించిన ప్రోత్సహించిన అలాంటి వారిపై చట్టరీత్య కఠినమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సుగుణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రాజేష్ తో కలిసి బాల్య వివాహాల నిర్మూలన చట్టాలపై చట్టాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఇంకా అక్కడక్కడ బాల్యవివాహాలు జరిపిస్తున్నారని తమ దృష్టికి తీసుకువస్తే అట్టి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాలలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, కురుమూర్తి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి:ఎంపీడీఓ శ్రీపాదు

**ఆత్మకూరు, మార్చి 5 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి పచ్చదనం పరిశుభ్రత లో భాగంగా గ్రామాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపాద అన్నారు. బుధవారం రోజు మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన తర్వాత ఆయన కూలీలకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఈ విషయంపై కూలీలకు సరైన సమయానికి వేతనాలు అందించే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శి చొరవ చూపాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ ,మచ్చేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంపత్ కుమార్‌ని ఎమ్మెల్సీగా నియమించాలి

**అయిజ, మార్చి 5 ప్రభాతవార్త :** ఎన్ఎస్‌యు కార్యకర్త నుండి ఏఐసీసీ దాకా పార్టీకి సేవలందించిన ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌ని రాష్ట్రకాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీగా నియంచాలని అయిజ పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప మాట్లాడుతూ సంపత్ కుమార్ తన 30 ఏళ్లరాజకీయ జీవితంలో సామాన్య కార్యకర్త నుండి యువజన కాంగ్రెస్ నాయకుడిగా, ఎన్ఎస్ఐయు నాయకుడిగా అలంపూర్ ఎమ్మెల్యేగా, ఏఐసిసి మహారాష్ట్ర ,చతీస్‌ఘడ్ కార్యదర్శిగా, జాతీయ స్థాయిలో ఆయన పార్టీకి సేవలందించారని, గుర్తు చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలో అలంపూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పనిచేసి రైతులకు, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటూ తనదైన శైలిలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన సేవలను అధిష్టానం గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉత్తనూరు జయన్న, మాజీ కౌన్సిలర్ గిత్తల దేవరాజు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడపిల్లలకు అండగా ఉంటాం

**400 మంది మహిళ లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ**

**పంపిణీ లో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు.**



మహిళలకు కల్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**ఇటిక్యాల, మార్చి5 ప్రభాతవార్త :** అల్లంపూర్ నియోజకవర్గంలోని పేదింటిఆడపిల్లలకు అండగా ఉంటూ కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం అందించేందుకు మహిళల పక్షాన ఉంటామని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం అల్లంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అల్లంపూర్, ఉండవల్లి, ఇటిక్యాల, మానవపాడు, వడ్డేపల్లి, రాజోలి మండలాలకు చెందిన దాదాపు 400 మంది మహిళా లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన మండలాల రెవెన్యూ అధికారులతో కలిసి అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ గ్రామాలలో అర్హులైన మహిళా పేదింటి ఆడపిల్లలకు ప్రభుత్వం రూ.1 లక్ష 116 ప్రభుత్వం అందించడం జరుగుతుందని చెక్కులు అందుకున్న వారు సకాలంలో బ్యాంకులకు వెళ్లి తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్లు మంజుల, వీరభద్రప్ప. నరేష్. ఆయా మండలాల తాహసిల్దార్లు, రెవిన్యూ సిబ్బంది మనోహర్, సుదర్శన్‌రెడ్డి, శోభ, అలీ భాష, నాయకులు పరమేశ్వర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ గజేందర్ రెడ్డి, మాజీ జోగులాంబ ఆలయ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, చంద్రహాస్ రెడ్డి, కిషోర్, ఆయా మండలాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, రెవిన్యూ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంటలకు మాడిపోతున్న హరిత మొక్కలు

**చోద్యం చూస్తున్న అధికారులు .. నష్టం జరుగుతున్న స్పందించరు**



మంటలకు మాడిపోతున్న హరిత మొక్కలు

**చిన్న చింతకుంట, మార్చి 5 ప్రభాతవార్త :** చెట్లే మానవాళికి జీవనాధారం అలాంటి చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి మానవునిపై ఉంది. చెట్లు పెరిగితే చాలు వాటిని నరికివేతకు అలాగే పెరిగే చెట్లను మంటలకు మసి చేస్తున్నారు. ఇలాంటి ఘటన నెల్లికొండి శివారులో చోటుచేసుకుంది. బుధవారం నెల్లికొండి శివారులోని రోడ్డుకిరువైపులా వేసిన హరిత మొక్కలు పెరిగి వృక్షాలుగా మారుతున్న తరుణంలో రైతులు అవగాహన లోపం కారణంగా తమ వ్యవసాయ గేట్ల సమీపంలో ఉన్న పిచ్చి మొక్కలను కాల్చి వేసే క్రమంలో హరిత మొక్కలను కూడా కాల్చివేస్తున్నారు. సంవత్సర కాలంగా హరిత మొక్కలను కాపాడుతూ వృక్షాలుగా మారుతున్న తరుణంలో అగ్గికి బుగ్గి చేస్తున్న నిత్యం వివిధ శాఖల మండల స్థాయి అధికారులు ప్రధాన రహదారి వెంట ప్రయాణం చేస్తున్న రోడ్డుకు ఇరువైపులా మంటలకు మసి అవుతున్న హరిత మొక్కలు కనిపించకపోవడం శోచనీయం. గత 15 రోజుల క్రితం తమ వ్యవసాయ పొలాలకు అనుకొని హరిత మొక్కలు ఆగ్నికి ఆహుతి అయిన మండల పరిషత్, ఉపాధి హామీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇష్టానుసారంగా హరిత మొక్కలను కాల్చి వేస్తున్న రైతులపై ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే దర్జాగా వృక్షాలు నరికివేతతో పాటు హరిత మొక్కలు కాల్చివేతకు గురవుతున్నాయని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హరిత మొక్కలను కాల్చివేస్తున్న రైతులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి హరిత మొక్కలను సంరక్షిస్తూ వృక్షాలుగా ఎదుగుతుండగా అవగాహన లోపం కారణంగా రైతులు హరిత వృక్షాలను కాల్చివేసి నష్టం చేస్తున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## నేటి నుంచి క్షయ వ్యాధి గుర్తింపు శిబిరాలు

**ఉప్పునుంతల మార్చి 5 ప్రభాతవార్త :** టీబీ ముక్త భారత్ అభియాన్ ఆరోగ్య పథకంలో భాగంగా మండల సామాజిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ కేంద్రాలలో ఈనెల ఐదు నుంచి క్షయవ్యాధి గుర్తింపు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ణి డాక్టర్ స్వప్న తెలిపారు. మండలంలోని అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాలలో వంద రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. షుగర్, బిపి, ధూమ, మద్యపానం అలవాటు కలిగి, 60 సంవత్సరాలు పైబడిన వారు, బిఎంఐ 18.5 కంటే తక్కువ నమోదు అయిన వారు, గత ఐదు సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు క్షయ వ్యాధి నిర్ధారించబడి చికిత్స తీసుకున్నవారు, వారి కుటుంబ సభ్యులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధికి సంబంధించి క్షయవ్యాధి స్క్రీనింగ్ ఎక్స్‌రే, తెమడ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. బుధవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఉదయం 9 గం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మండలంలోని కంసానిపల్లి , సదగోడు గ్రామాలలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శుక్రవారం ఉప్పరి పల్లిలో ఉదయం 8 గంటలకు, తాడూరు లో మధ్యాహ్నం 12 గంటలకు, వెల్టూరులో మధ్యాహ్నం 2 గంటలకు , శనివారం మండలంలోని పిరాట్వాన్ పల్లి గ్రామంలో ఉదయం 9 గం.లకు , పెనిమిళ్ళ లో మధ్యాహ్నం 12 గం.లకు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి డా. స్వప్న కోరారు. శిబిరానికి ముందు ఆసుపత్రి ముందు క్షయవ్యాధి గోడ పత్రికను విడుదల చేశారు. గోడపత్రిక విడుదల చేసిన వారిలో వైద్యాధికారిణి డాక్టర్ స్వప్నతో పాటు హెల్త్ సూపర్వైజర్ ప్రభావతి, శ్రీనివాసులు, దేవి, రమేష్ గౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

## బీసీలంతా హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలి

**బీసీ జనచైతన్య జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు అజయ్ కుమార్ యాదవ్**



సమావేశంలో అభివాదం తెలుపుతున్న నాయకులు

**కోయిలకొండ, మార్చి 5 ప్రభాతవార్త :** బీసీలంతా ఏకమై హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని బీసీ జనచైతన్య జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డా. దాసరి అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని ఆచార్య పూర్ గ్రామంలో బీసీ జన చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ వ్యక్తిని సీఎం చేయాలని అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. విద్య, వైద్యంపై చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు అంతకంటే ఎక్కువ సంతానం ఉన్నా వారికి పోటీకి అనుమతించాలన్నారు. కుల గణనలో వచ్చిన కులాల వారిగా, గ్రామాలవారిగా బహిర్గతం చేయాలన్నారు. జనాభా నిష్పత్తిప్రకారం బీసీకులాలకు రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంత రం బీసీ జన చైతన్య వేదిక మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి బీసీ జన చైతన్య వేదిక రాష్ట్ర యువత అధ్యక్షులు మహేష్ యాదవ్, జిల్లా అధ్యక్షులు గోపాల్ యాదవ్ హాజరయ్యారు. అనంతరం బీసీ జన చైతన్య వేదిక మండల అధ్యక్షులుగా భీమన్నయాదవ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్, రాజు, హనుమంతు, చెన్నప్ప, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య యాదవ్, ప్రచార కార్యదర్శిగా మాణిక్యం, కార్యదర్శులుగా వెంకటయ్య, రాములు, గాలయ్య, నారాయణ యాదవ్, కోశాధికారిగా ఆంజనేయులు యాదవ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మైసమ్మ ఆలయ టెంకాయలు పూజ సామాగ్రి వేలం ప్రక్రియ పూర్తి

**నవాబుపేట, మార్చి 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పర్వతాపూర్ మహిమాన్విత మైసమ్మ దేవస్థానంలో నిన్న బుధవారం పూజా సామాగ్రి. టెంకాయల విక్రయ వేలం పాట జిల్లా ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ మెంబర్లు కాకర్లపాడు గ్రామ ప్రజా ప్రతినిధులు వేలంపాట వివిధ పార్టీల నాయకుల సమక్షంలో కీలక ప్రక్రియ ఉత్కంఠ భరితంగా ముగిసింది. ఆలయ టెంకాయలు, పూజా సామాగ్రి పూలు విక్రయ షాపులకు, నిర్వహణకు సంబంధించిన వేలంపాట ప్రక్రియ జరిగింది. హోరాహోరీగా సాగిన వేలంలో వెంకటేష్ , నర్సింలు హోరాహోరీగా వేలం పాట పాడారు. ఆఖరికి వెంకటేష్ రూ. 31 లక్షల 83 వేలకు కొబ్బరికాయల వేలం దక్కించుకున్నాడు. గత ఏడాది కంటే 2000 అధిక ధర పాడారు. పూజా సామాగ్రి వేలం అంకం ఆంజనేయులు రూ. 14 లక్షల 70 వేలకు పూజ సామాగ్రితోపాటు పూలు సామాగ్రి రూ.5 లక్షల 67 వేలకు దక్కించుకున్నాడు. వేలం పాడిన వ్యక్తులు నిర్మిత సమయంలో డబ్బులు చెల్లించాలని ఆలయ ఈవో అధికారులు తెలిపారు. గత ఏడాది కంటే కాస్త ఆదాయం పెరిగింది. మొత్తం 3 వేలం పాటల నిర్వహణ ద్వారా ఆలయానికి మొత్తం రూ. 54 లక్షల 20వేల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులతో పాటు జిల్లా ఎండోమెంట్ డిఐజి చౌహన్ ఆలయ ఈవో నరసింహులు, ఆలయ చైర్మన్ జగన్మోహన్ రెడ్డితో పాటు రికార్డ్ అసిస్టెంట్ గోపాల్ అటెండర్ అనసూయ గ్రామ ప్రజాప్రతినిధులు బక్క బాలయ్య, మైనుద్దీన్, పాశం నరేందర్, వివిధ పార్టీల నాయకులు గ్రామస్తులు ఆలయ పూజారులు శ్రీకాంత్ శర్మ, రమేష్, మల్లేష్, లింగమాచారి, ఆలయ కమిటీ డైరెక్టర్లు, ఆలయ కమిటీ డైరెక్టర్లు కేతావత్ మేఘ్యా, పాశం రామస్వామి, గడ్డమీద మల్లయ్య, పాశం శివరాజు, బుప్పటి రవీందర్, పలికే ఆంజనేయులు, పిచ్చకుంట్ల శాంతయ్య, అంకం రమాదేవి మురుగని బాలకృష్ణయ్య, కట్ట బాలస్వామి, మురుగని బాలకృష్ణయ్య, కట్ట బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## పని ప్రదేశాలలో మహిళలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ వి.రజని**




సదస్సులో మాట్లాడుతున్న వి.రజని పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

**వనపర్తి క్రైమ్, మార్చి 5 ప్రభాతవార్త :** పని ప్రదేశాలలో మహిళలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు బుధవారం వనపర్తి జిల్లాలోని మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది ఈ సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటు ప్రభుత్వ ఇతర కార్యాలయాల్లో ఖచ్చితంగా నలుగురితో కూడిన ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. నలుగురిలో ఇద్దరు మహిళలు ఉండాలని ఈ కమిటీలో సంస్థలోని సీనియర్ మహిళ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా నియమించబడుతారు. ఏ మహిళ అయినా లైంగికంగా వేధించబడితే ఈ కమిటీలు ఫిర్యాదు చేస్తే నిజానిజాలు పరిశీలించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది. బాధితురాలు యొక్క సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారని పని ప్రదేశాలలో లైంగికంగా వేధించబడిన మహిళలు ధైర్యంగా కార్యాలయంలో ఉన్న ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలలో ఫిర్యాదులు చేయాలని కోరారు అదేవిధంగా మహిళా హక్కులను చట్టాలను గురించి వివరించారు. అన్ని వర్గాల మహిళలందరికీ కూడా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఉచిత న్యాయ సేవలు అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ యూనస్, బార్ వైస్ ప్రెసిడెంట్ డి.కృష్ణయ్య, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి.ఉత్తరయ్య పాల్గొన్నారు.

## కనుల పండవగా పెద్ద రథోత్సవం

**వెల్దండ, మార్చి 5 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెంది విరజిల్లుతున్న గుండాల అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. పెద్ద రథోత్సవానికి పూలతో చూడచక్కగా అలంకరించారు. బుధవారం తెల్లవారుజామున రథోత్సవ వేడుకలకు ప్రజలు తిలకించడానికి విచ్చేశారు. రథశాల వద్ద రథోత్సవానికి పూజరులు కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఆలయ ఈఓ ప్రసాద్‌చే ప్రత్యేక పూజలు నిర్వహించి కుంభం పోసి దేవుడిని రథోత్సవం పైకి ఎక్కించి పూజారులు మంగళహారతిలు ఇవ్వగా గోవింద నామస్మరణతో రథోత్సవాన్ని భక్తులు లాగారు. గాలి గోపురం చుట్టూ తిరిగి రథశాల వద్దకు చేరుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. కొందరు భక్తులు జాతరలోనే వంటా వార్పు చేసుకుని సహపంక్తి భోజనలు చేశారు. భక్తులు అంబ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ అరుణ్‌నాయక్‌తో పాటు పాలక మండలి సభ్యులు ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్య శర్మ, శివప్రసాద్ శర్మ, సంతోష్ శర్మ, నరహరి శర్మ, వీరేశం శర్మ, సురేష్ శర్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల సోషల్ రెస్పాన్సిబిలిటీ టీంకు అవార్డు



అవార్డు అందుకుంటున్న విద్యుత్ ఉద్యోగి అశోక్

**గద్వాల, మార్చి 5 ప్రభాతవార్త :** శ్రీమాత సేవా సంస్థ హైదరాబాద్ వారు ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సామజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నా వారిని గుర్తించి బుధవారం రవీంద్ర భారతిలో సన్మానం చేసినట్లు విద్యుత్ ఉద్యోగ సంఘం నాయకుడు అశోక్ తెలిపారు. దీంట్లో భాగంగా గద్వాల్ జిల్లలో సోషల్ రెస్పాన్సిబిలిటి టీమ్ పేరుతో విరివిగా సేవ కార్యక్రమాలు చేస్తున్నా టీమ్ తరుపున అశోక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాత సేవ సంస్థ అధ్యక్షుడు కుసుమకుమారి, ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్, పి.జనార్ధన్ రెడ్డి కూతురు విజయ రెడ్డి, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**వెల్దండ, మార్చి5 ప్రభాతవార్త:** తిమినోనిపల్లి గ్రామానికి చెందిన సాయమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న గ్రామ నాయకులు గండికోటరాజు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3వేలు, అదే విధంగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ రూ.2వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ పార్టీ నాయకులు ఉన్నారు.

## పిఈటి బి.గోపాలంకు ఘన సన్మానం

**మక్తల్, మార్చి 5 ప్రభాతవార్త :** షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్రాంత పిఈటి బి.గోపాలంను బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం. మమత ఇటీవల జరిగిన జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో అసమాన క్రీడా ప్రతిభను ప్రదర్శించి వెండి పతకం సాధించడంలో విశేష కృషి చేసిన బి.గోపాలంను కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరీ, వైస్ ప్రిన్సిపల్ సునీత ఆధ్వర్యంలో అధ్యాపక బృందం పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రిటైర్మెంట్ తర్వాత కూడా క్రీడా రంగానికి విశేష కృషి అందిస్తున్న బి.గోపాలం సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు.

## ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాం రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**ఇటిక్యాల, మార్చి 5 ప్రభాతవార్త :** అల్లంపూర్ నియోజకవర్గంలో జనం మెచ్చిన నేత జన హృదయనేత అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి జన్మదినం పురస్కరించుకొని బుధవారం అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల కార్యకర్తలు అభిమానులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

**పానుగల్ మార్చి 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలతో పాటు రేమద్దుల ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు, జిహెచ్‌ఎంగా ఇందు కలెక్టర్‌గా మహేందర్ డీఈఓగా దినేశ్వర్ ,డిప్యూటీ డిఈఓగా తేజేందర్, ఎంఈఓలు గా తిరుపతి ,మహబూబ్ అలీ ,హెచ్‌ఎంగా లావణ్యతో పాటు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు అందజేత

**నవాబుపేట, మార్చి 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎన్మనగండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు బుధవారం గోనయో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10 తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణి చేయడం జరిగింది. గోనయో ఫౌండేషన్ సభ్యులు ప్రశాంత్ మాట్లాడుతూ వచ్చే యాన్యువల్ ఎగ్జామ్స్‌లో రూ.500 ల మార్కులు దాటిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం చేస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు డీలర్ గోపాల్, శివాదర్శనం గౌడ్, వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు కోస్గి శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భీమ్ దీక్ష పోస్టరు విడుదల



**గద్వాల, మార్చి 5 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు స్వేరోస్ భీమ్ దీక్ష పోస్టర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అతీక్ ఉర్ రహమాన్ బుధవారం రిలీజ్ చేశారు. స్వేరోస్ రాష్ట్ర కమిటీ మెంబర్ దేవన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గద్వాల జిల్లా స్వేరోస్ ఉపాధ్యక్షుడు రఫీ ఆధ్వర్యంలో భీమ్ దీక్ష పోస్టర్ రిలీజ్ లో స్వేరోస్ నాయకులు, శంకర్, గాజుల కృష్ణారెడ్డి, రాము, శీను తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్‌కు ప్రత్యేక టోల్ ఫ్రీ

- 25శాతం రాయితీ సద్వినియోగం చేసుకోవాలి
- మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

**మహబూబ్‌నగర్, మార్చి5, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపిన విషయం తెలిసిందే. ఈనెల 31వరకు ఈ పథకం చెల్లింపులకు 25శాతం రాయితీ ఇస్తున్నట్లు మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు. ఈ పథకానికి సంబంధించి ఏదైనా సమాచారం కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ 08542241165 నెంబర్‌ను సంప్రదించాలని అదేవిధంగా హెల్ప్‌లైన్ కోసం 7093911352 ను సంప్రదించాలని సూచించారు. ప్రతి రోజూ ఉదయం10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సమాచారం పొందవచ్చని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వరి పంట తెగుళ్లపై తగిన జాగ్రత్త తీసుకోవాలి

**నారాయణపేట టౌన్,మార్చి 5 ప్రభాతవార్త :** వరి పంటపై సోకుతున్న తెగుల నివారణ పట్ల రైతులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడి పొందడానికి ఆస్కారం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి మణిచందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బాపన్‌పల్లి గ్రామంలో రైతు పొలాలను సందర్శించి వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట పట్ల రైతులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వరి చేనులో అగ్గి తెగుళ్లతో పంట తీవ్ర నష్టంవాటిల్లుతోందని జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడి వస్తుందని సూచించారు. ముందురోజు కొద్దిగా చిన్న మచ్చలుగా కనిపించే అగ్గి తెగులు మరుసటి రోజుకు మడి మొత్తం వ్యాపించి పంటను నాశనం చేస్తుంది. నివారణ కోసం ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా/లీ. లేదా కాసుగామైన్ 2.5 మి.లీ./లీ. లేదా ఐసోప్రోథయోలిన్ 1.5 మి.లీ./లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి. సకాలంలో జాగ్రత్తలు చేపడితే ఈ తెగులు నుండి పంటను రక్షించుకోవచ్చు అన్నారు. పొలాలను సందర్శించిన వారిలో రైతులతో బాటు తదితరులు ఉన్నారు.

## అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**నవాబుపేట, మార్చి 5 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం హమాయ హయాంలో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని చౌడూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు అన్నారు. నవాబుపేట మండల పరిధిలోని చౌడూరు గ్రామంలో బుధవారం ఎస్సీ కాలనీలో ఐదు లక్షల నిధులతో అండర్ డ్రైనేజీ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. జడ్చర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి చొరవతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి గణనీయంగా జరుగుతుందని రోడ్లు, అండర్ డ్రైనేజీల పనులు చక చకా జరుగుతున్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు. మాజీ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి దుశ్యంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆకుల అమరేశ్వర్, చిన్నయ్య బిజ్జలి గోపాల్ యాదవ్, చిన్నారి నరసింహులు, చాకలి సత్యం, యూసుఫ్ హైమద్, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు, పాల్గొన్నారు.

## రైతులకు విద్యుత్తు సమస్యలు లేకుండా కృషి

**వనపర్తి క్రైమ్, మార్చి 5 ప్రభాతవార్త:** బోరు బావుల ఆధారంగా పంటలను వేసుకున్న రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా కృషి చేస్తామని వనపర్తి ఎస్ఈ రాజశేఖర్ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బలిజపల్లి శివారులో రైతులకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పెద్దమందడి మండలం జంగమయ్యపల్లి గ్రామ శివారులో బోరు బావుల ద్వారా పంటలు పండిస్తున్న రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కొరకు డిడిలు కట్టి దరఖాస్తు చేసుకున్నారని అదివరకే చాలామంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కొరకు దరఖాస్తు చేసుకోవడం వల్ల వారికి మంజూరు కాలేదని తెలియజేశారు. అయినప్పటికీ రైతుల విన్నపం మేరకు రైతుల పంటలను పరిశీలించి విద్యుత్తు సమస్య వల్ల నీరు అందక పంటలు ఎండిపోతాయని గ్రహించి అత్యావసర పరిస్థితులలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని వారు తెలిపారు. ఎండాకాలం వస్తుండడంతో విద్యుత్తు అవసరం పెరిగే అవకాశం ఉందని విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని రైతులు సమన్వయం పాటించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వాల సహకారంతో సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో పాటునిరంతరంపర్యవేక్షణ చేపట్టి అవసరమైన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తూ విద్యుత్తు సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి డిఇ శివరాం, ఏడిఈ శివ శంకర్ రెడ్డి, ఏఈ సుధాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేను ఎమ్మెల్యేగా గెలిచిందే మీకు దారి చూపేందుకు..

- బంగారు తెలంగాణ మన మహబూబ్‌నగర్ బిడ్డల నుంచే ప్రారంభం కావాలి
- ఎన్టీఆర్ మహిళ డిగ్రీ కళాశాలకు ఎటువంటి వసతులు కావాలన్నా కల్పిస్తా
- దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం
- వార్తా పత్రికలు చదవడం నేర్చుకోవాలి : మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్‌బ్యూరో, మార్చి 5 ప్రభాతవార్త:** బంగారు తెలంగాణ మన మహబూబ్‌నగర్ బిడ్డల నుంచే ప్రారంభం కావాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ కళాశాల లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించి, అనంతరం సివిల్ సర్వీసెస్, బ్యాంకింగ్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఫౌండేషన్ కోర్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహబూబ్‌నగర్ దశ దిశను మార్చాలని, మీలాంటి వారికి దారి చూపాలని నేను రాజకీయాలకు వచ్చి ఎమ్మెల్యేగా గెలిచానని ఆయన స్పష్టం చేశారు. మీకు అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన చెప్పారు. మీరు ఏ సబ్జెక్టులో డిగ్రీ చేస్తున్నా, కాంపిటీటివ్ ఎగ్జామ్‌లో రాణించాలంటే అన్ని సబ్జెక్టుల పైన పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాల్లోనే కాదు ప్రైవేటు ఉద్యోగాల్లో రాణించాలన్నా మనకు జనరల్ నాలెడ్జ్ అవసరమని అందుకే ప్రతి ఒక్కరూ తప్పకుండా దిన పత్రికలను చదవాలని, దినపత్రికలను చదవడం వల్ల ప్రపంచంలో జరిగే అనేక విషయాలు తెలుస్తాయని ఆయన చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ ఏదైన ఒక జాతీయ వార్తా పత్రికను చదివే అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. మన ఎన్టీఆర్ మహిళ డిగ్రీ కళాశాల లో కర్నాటక రాష్ట్రంలోని హుబ్లీ కేంద్రంగా పనిచేస్తున్న దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. హుబ్లీలో రెండు రోజులపాటు జరిగిన దేశ్ పాండే ఫౌండేషన్ కార్యక్రమంలో నేను పాలుపంచుకోవడం జరిగిందని, వచ్చే సోమవారం దేశ్ పాండే ఫౌండేషన్ నిర్వాహకులు కళాశాల ను సందర్శించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ కళాశాలలో చదువుతున్నది కేవలం3000 మంది విద్యార్థులు కాదు 3000 కుటుంబాల భవిష్యత్తు అని, మీరు 30 వేల మందికి స్ఫూర్తిని ఇవ్వాలని ఆయన సూచించారు. మీ అందరి భవిష్యత్తు బాగుండాలని, మీరు జీవితంలో అభివృద్ధిలోకి రావాలని మాతోపాటు మీకు పాఠాలు నేర్పించే గురువుల ఆకాంక్ష అనిఆయన స్పష్టం చేశారు. మహిళ విద్యపైన ప్రత్యేక శ్రద్ధ వహిస్తు న్నానని చెప్పారు. 34 సంవత్సరాల పాటు చదువుపైన దృష్టి కేంద్రీకరించి మంచిగా చదువు కోవాలని మీ లక్ష్యంపైన అలాగే మీ స్కిల్స్‌ను పెంచుకొనేందుకు ప్రయత్నం చేయాలని అన్నారు. మహబూబ్‌నగర్ విద్యార్థులు ఎవరికీ తీసిపోరని, ఎవరికి తక్కువ కాదు అని ఆయన చెప్పారు. మీకు మేము అండగా ఉంటాం, మీ గోల్స్ నిర్ణయించుకొని, వాటిని సాధించడానికి మీరు కృషి చేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మీకు బంగారు భవిష్యత్తు కల్పించేందుకు నేను ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ వేసవి సెలవుల్లో కళాశాలను మూసి వేయకుండా విద్యార్థులకు ఏదైనా ఒక స్కిల్స్ పైన లేదా ఏదైనా కాంపిటీటివ్ పరీక్షలపైన శిక్షణ తరగతులను నిర్వహించాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే కళాశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, కోఆర్డినేటర్ డా. పద్మ అనురాధ, బిసి స్టడీ సర్కిల్ భవాని శంకర్, ఎన్ఎస్‌యుఐ నాయకులు ముకుందం రమేష్, శివ జోగి, నరేష్, శ్యాంసుందర్, రమేష్ సాగర్, యాదగిరి పాల్గొన్నారు.

## యూత్ పార్లమెంట్‌లో పాల్గొనాలి

పియులో పోస్టర్ ఆవిష్కరించిన వీసీ, రిజిస్ట్రార్



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి5 ప్రభాతవార్త:** యువత యూత్ పార్లమెంటు 2025,లో పాల్గొనాలని పాలమూరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పాలమూరు యూనివర్సిటీలో యూనివర్సిటీవైస్ ఛాన్సలర్ ప్రొ॥ జి.ఎన్.శ్రీనివాస్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ॥ చెన్నప్ప చేతుల మీదుగా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంవిఎస్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కె.పద్మావతి మాట్లాడుతూ ఈ నెల 9లోపు 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయసు ఉన్న విద్యార్థులు, యువతీ, యువకులు యూత్ పార్లమెంట్ లో పాల్గొనేందుకు మై భారత్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకొని ఒక నిమిషం వీడియోను అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు కూడా పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట

◆ ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి

**అడ్డాకుల, మార్చి 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పొన్నకల్ గ్రామంలో బుధవారం నాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిఎంఆర్ ఫౌండేషన్ సేవా సమితి ద్వారా ప్రత్యేకంగా తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను నియోజకవర్గం శాసనసభ్యులు జి మధుసూదన్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం కాలినడకన పాఠశాలకు వచ్చే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, పాఠశాలలో మౌలిక వసతులను పట్టించుకోలేదని, పదేళ్ల పాలనలో టీచర్ల నియామకాలను చేపట్టలేదని, విద్యాశాఖకు నిధులు కేటాయించలేదని బిఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖకు అధిక నిధులు కేటాయించడంతో పాటు


విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న జిఎంఆర్


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 15 ఏళ్ల తర్వాత సుమారు 19,000మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, స్కూలు ప్రారంభమైనమొదటి వారంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశామని, పదేళ్లలో ఎన్నడు లేని విధంగా విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని గుర్తు చేశారు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఏకాగ్రతతో చదువుకోవాలని, పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణతసాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కె.నాగిరెడ్డి, జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి గంగుల విజయ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగార్జున రెడ్డి, మాజీ ఎంపీటీసీ శకుంతలమ్మ, మండల యూత్ అధ్యక్షులు శరత్ కుమార్ రెడ్డి, అరవింద్ రెడ్డి, హేమవర్ధన్ రెడ్డి, మండల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందం, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అమ్ములపొదలోకి నూతన జాగిలం లక్కీ

◆ నూతన జాగిలం లక్కీ..
పేలుడు పదార్థాలను కనుగొనడంలో దిట్ట
◆ నూతన జాగిలం లక్కీ, డాగ్ హాండ్లర్‌కి గోల్డ్ మెడల్, ప్రశంస పత్రం అందజేసి అభినందించిన జిల్లా ఎస్పీ


గోల్డ్‌మెడల్ అందజేస్తున్న ఎస్పీ

**నారాయణపేట టౌన్,మార్చి 5 ప్రభాతవార్త :** 9 నెలల పాటు హైదరాబాద్ మొయినాబాద్ లో కఠోర శిక్షణను పొంది నారాయణపేట జిల్లాకు వచ్చిన నూతన జాగిలం లక్కీని బుధవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నాలుగు రాష్ట్రాలు తెలంగాణ, త్రిపుర, బీహార్, గోవా రాష్ట్రాలకు సంబంధించిన 32 డాగ్స్ పేలుడు పదార్థాలు గుర్తించడంలో పోటీపడగా అందులో నారాయణపేట జిల్లా డాగ్ లక్కీకి డాగ్ హండ్లర్ పిసి భగవంతుకు గోల్డ్ మెడల్ రావడం జరిగిందని ఆర్ఐ నరసింహ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన జాగిలం లక్కీ,డాగ్ హండ్లర్ బాగవంతులను ఎస్పీ అభినందించి గోల్డ్ మెడల్, ప్రశంస పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నారా యణపేట జిల్లా అంతర్గత భద్రతలో కీలక పాత్ర పోషించనున్న జాగిలాల బృందానికి మరో జాగిలం లక్కీ రావడం అదనపు బలంగా సంతోషకరం అని తెలిపారు. ఈ జాగిలం లాబ్రడార్ రిట్రీవర్ జాతికి సంబంధించిన జాగిలం, ఈ జాగిలం ముఖ్యంగా పేలుడు పదార్థా లైనా టిఎన్టి, ఆర్డిఎక్స్, పీఈకె, సేఫ్టీ ఫ్యూస్, కార్డెక్స్, అమోనియం నైట్రేట్, జిలటన్ స్టిక్స్, అత్యాధునిక ఆయుధాలైన ఐఈడీలు, బాంబులనుకనుగొనడంలో వీటి పనితీరుదిట్టమనితెలిపారు. డాగ్‌కు ఉండడానికి సంబంధించిన అన్ని సదుపాయాలు కల్పించాలని, ప్రతి రోజూ ఎక్సైజ్, వాటికి కావలసిన డైట్ అందించాలని, జిల్లా పరిధిలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆర్ఐకి తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ నరసింహ, డాగ్ స్క్వాడ్ బృందం ఇంచార్జ్ రాజేశ్వర్ రెడ్డి, పోలీసు జాగిలం లక్కీ, హండ్లర్ పిసి భగవంత్ పాల్గొన్నారు.

# సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి

- సైబర్ క్రైమ్ డిఎస్పి ఎన్.బి రత్నం


విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్.బి రత్నం

**వనపర్తి క్రైమ్, మార్చి 5 ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎన్బి రత్నం పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు సైబర్ నేరాల, సైబర్ భద్రతపై అవగాహన గురించి ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగృక్త దివాస్ అనే ప్రత్యేక కార్యక్రమం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు, యువతకు, ప్రజలకు సైబర్ భద్రత, సైబర్ నేరాలపైఅవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సైబర్ డిఎస్పి అన్నారు. అందులో భాగంగా బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు, సైబర్ నేరాలు భద్రత పై అవగాహన కల్పించడంలో భాగంగా తెలంగాణ పోలీసు ఆధ్వర్యంలో సైబర్ జాగృక్త దివస్ అనే కార్యక్రమం ద్వారా సైబర్ భద్రత తో పాటు సైబర్ నేరాల నివారణకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిఎస్పి,వితీ, రత్నం మాట్లాడుతూ సైబర్ నేరాలు పలు రకాలుగా ఉంటాయని వాటిపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, సైబర్ స్టాకింగ్, వర్క్ ఫ్రం హోం పేరుతో మనల్ని ఆకర్షితులను చేస్తూ, కొన్నిసార్లు భయభ్రాంతులకు గురి చేస్తూ మన నుండి డబ్బులను కాజేస్తారని వివరించారు. అట్టి వాటిని నమ్మకూడదని, ఒకవేళ డబ్బులు నష్టపోతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి కంప్లైంట్ రిజిస్టర్ చేసుకోవాలని, తదుపరి సమీప పోలీస్‌స్టేషన్‌ని సంప్రదించమని తెలియజేశారు. నేటి సమాజంలో ఇంటర్నెట్ వినియోగం పెరిగిందని, వాటిపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియా వాడకం సరైన పద్ధతిలో ఉండాలని, మనకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టుకోకూడదని, ఇంటర్నెట్ అనేది జ్ఞానాన్ని పెంచుకోవడానికి తప్ప, మరొక విధంగా వాడకూడదని, ముఖ్యంగా విద్యార్థినిలు వారి వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయకపోవడం మంచిదని, అపరిచిత వ్యక్తులను ఫేస్బుక్లో గాని, ఇంస్టాగ్రామ్ లోగాని, మరే విధమైన సోషల్ మీడియా సైట్లలో స్నేహితులుగా యాక్సెప్ట్ చేయకూడదని, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే వీడియో కాల్స్‌లను అటెండ్ చేయకూడదని, అదేవిధంగా విద్యార్థులు బెట్టింగ్ యాప్‌లకి దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు మొదట డబ్బు ఆశ చూపి, తదుపరి మన ఫోన్లో ఉన్న డేటాను తస్కరించి, తద్వారా మన బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బులను కొట్టేస్తారని వివరంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో వనపర్తి టౌన్ ఎస్సై, హరిప్రసాద్, సైబర్ క్రైమ్ ఎస్సై, రవిప్రకాష్, బాలికలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# బల్దియాలో ప్రతి ఉద్యోగి బాధ్యతతో పని చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ సంతోష్ ఆదేశాలు


గద్వాల మున్సిపల్ అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, అదనపు కలెక్టర్, కమిషనర్ దశరథ్

**గద్వాల, మార్చి5 ప్రభాతవార్త:** మున్సిపాలిటీలో ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. బుధవారం గద్వాల్ మున్సిపాలిటీ కార్యాలయంలో గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తో కలిసి మున్సిపాలిటి పని తీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో సిబ్బంది,అధికారుల విధులు, పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, వాహనాల స్థితి, ట్రేడ్ లైసెన్సులు, ఆదాయ వనరులు, భవన అనుమతులు, షాపులు, ప్లాట్స్, ఆస్తి పన్ను వసూళ్లు, యంత్రాలు, తదితర అంశాలపై సమీక్షించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గద్వాల పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగ్గా అమలు చేయాలని అన్నారు. మున్సిపాలిటీ సిబ్బంది హాజరును పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు బయోమెట్రిక్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ వాహనాలకు జి.పి.ఎస్.ట్రాకర్ ఏర్పాటు చేయాలని, ప్రతి రోజు ఆ వాహనాల మూమెంట్ ను గమనించాలని అన్నారు. ప్రతిరోజు చెత్త సేకరణ ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 2 గంటల నుండి 5 గంటల వరకు రెండుసార్లు సేకరించాలన్నారు. పార్కులను పరిశుభ్రంగా ఉంచి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రత్యేకంగా సంఘాల పార్క్ వద్ద పారిశుధ్య కార్మికులను నియమించి, అన్ని సౌకర్యాలను మెరుగుపరచాలనిసూచించారు. వీధి దీపాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, లోపాలు ఉంటే వెంటనే మరమ్మత్తులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో నిర్దేశిత లక్ష్యం మేరకు వంద శాతం ఆస్తి పన్ను పూర్తి స్థాయిలో వసూలుచేయాలని అన్నారు. ఐడిఎస్ఎంటి స్మాల్ మీడియం టౌన్ల సమగ్ర అభివృద్ధికి ప్రొపోజల్ సిద్ధం చేసి, పట్టణ ఆదాయ వనరులను పెంచే విధంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన స్థలాలలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని, వాటిని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయాలను పక్కాగా నిర్వహించి, అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, మున్సిపాలిటీలోఅవినీతికి తావు లేకుండా గద్వాల్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, మౌలికసదుపాయాల మెరుగుదలఅత్యవసరమని పేర్కొంటూ, మున్సిపల్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిపిఎస్ ట్రాకింగ్, బయోమెట్రిక్ హాజరు, వంద శాతం ఆస్తిపన్ను వసూలు వంటి చర్యలను క్రమబద్ధంగా అమలు చేయాలని సూచించారు. జననం, మరణ తదితర సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండ అందించాల్సిందిగా సూచించారు. మున్సిపాలిటీలో కీలకపదవులకు బాధ్యత లేని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించకుండా, ముఖ్యమైన బాధ్యతలు రెగ్యులర్ ఉద్యోగులకే అప్పగించాలనిఅన్నారు. అభివృద్ధి పనులకు కేటాయించిన బడ్జెట్‌ను సమర్థవంతంగా ఉపయోగించి గద్వాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్కులు, వీధి దీపాలు, నీటి సరఫరా, షాప్స్, డ్రైనేజీ, తదితర పనులను వేగవంతంగా పూర్తి చేసి పట్టణ వాసులకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఆదాయం పెంపొందించేందుకు నిర్మించిన కమర్షియల్ షాపులు, కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గల లేఔట్ లో ఉన్న 33 ప్లాట్ల విషయమై ఈ సందర్భంగా చర్చించడం జరిగింది. అనంతరం కలెక్టర్, శాసన సభ్యులు మున్సిపల్ వాహనాలు ట్రాక్టర్లు, స్వీపింగ్ మెషిన్లు తదితర యంత్రాలను పరిశీలించడం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ నర్సింగ రావు, మున్సిపల్ కమిషనర్ దశరథ్, మున్సిపల్ ఏఈ గోపాల్, మున్సిపాలిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలను నివారించాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని సూచించారు. తర్వాత జూనియర్ కళాశాలలు ,డిగ్రీ కళాశాలల్లో ఎన్.ఎస్.ఎస్.విద్యార్థులతో రోడ్డు సేఫ్టీ కమిటీలు, వాలంటీర్ లను నియమించాలని కోరారు. 15 సంవత్సరాలు దాటినకాలం చెల్లిన వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. వాహనాలు మాన్యువల్ చెకప్ నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం 2024 నవంబర్ 16 నుండి ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్డు టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు వంద శాతం మినహాయింపు చేసిందని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. రానున్న రోజుల్లో రోడ్డు భద్రతకు మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీడి.జానకి,జ ాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ చంద్ర శేఖర్‌గౌడ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అర్‌బి ఈఈ దేశ్యా నాయక్, ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐ విధానంతో సులభతర బోధన

**మక్తల్, మార్చి 5 ప్రభాతవార్త :** ఏఐ విధానంతో విద్యార్థులకు మరింత సులభతరంగాపాఠ్యాంశాలను బోధించవచ్చని, ఉపాధ్యాయులు పూర్తి అవగాహనతో ఈ విధానాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాధికారి అనిల్ గౌడ్ అన్నారు. మండలంలోని కర్ని ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న ఏఐ తరగతి గదిని బుధవారంఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఐ బోధన పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో క్లస్టర్ జిహెచ్ఎం వెంకటయ్య గౌడ్, పాఠశాల హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులుఎల్లప్ప, వెంకటేష్, రమ్య, ప్రతిభ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఐ కమిషనర్లను నియమించాలి

**మద్దూరు, మార్చి5 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. నారాయణపేట జిల్లా ఇంచార్జీ ఎడ్ల కురుమయ్య హాజరై మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో వివిధ శాఖల వారిగా సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోసం దరఖాస్తు చేసిన ఎలాంటి స్పందన లేదని తెలిపారు. అలాగే సెక్షన్ 19(1)ప్రకారం దరఖాస్తు చేసిన కూడాఅడిగిన దరఖాస్తుకు స్పందన కరువైందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో పారదర్శకత అందించాలంటే ఆర్టిఐ కమిషనర్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నారాయణపేట అసెంబ్లీ అధ్యక్షుడు గణేష్, మండల అధ్యక్షుడు వెంకటప్ప, మండల ప్రధాన కార్యదర్శి మురళి, కార్యదర్శి రాము తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

**మద్దూరు, మార్చి5 ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగంపల్లి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వివరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగంపల్లి వాగు నుండి ఖాజీపూర్ గ్రామానికి మంగళవారంఅర్ధరాత్రి అక్రమంగా రెండుట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా కాజీపూర్ శివారులో ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కుతరలించడం జరిగిందనిఅనంతరం వారిపై కేసు నమోదుచేసుకొనిదర్యాప్తుచేస్తున్నట్లుఎస్సై విజయ్‌కుమార్ వివరించారు.

## సూచిక బోర్డు, స్టిక్కర్ ఏర్పాటు చేయండి

**పెబ్బేరు, మార్చి 5 ప్రభాతవార్త :** పెబ్బేర్ మున్సిపల్ పరిధిలోని బాలాజీ ఎలక్ట్రానిక్స్ షాప్, పిజెపి క్యాంప్ ముందు డివైడర్ కు సూచిక బోర్డు లేనందున మంగళవారం రాత్రి సమయంలో ఇండికా కార్ డ్రైవర్ అదుపుతప్పి డివైడర్ కు ఢీకొనడం వలన కారు ఇంజన్ దెబ్బతినీ స్వల్ప గాయాలు తగిలాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివైడర్ ముల మలుపులు ఉన్నచోట సూచిక బోర్డులు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం

**మహబూబ్‌నగర్, మార్చి 5 ప్రభాతవార్త:** వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయెందిర బోయి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపిడిఓలు, ఎంపిఓలు, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ త్రాగు నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా గ్రామాల్లో వున్న హ్యాండ్ పంప్ లను అవసరం ఉంటే రిపేర్లు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా పైపు లైన్ లీకేజీలు, పైప్ లైన్ డ్యామేజ్‌లను గుర్తించి వెంటనే రిపేర్‌లు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు, మోటార్‌లు ఏమైనా రిపేర్లు చేయాలని అన్నారు. ప్రతి ఇంటికి నీటి కొరత లేకుండా చూడాలని, మోటార్లు మరమ్మతులు ఉన్న చోట నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, డిమాండ్ కంటే తక్కువ సప్లై ఉంటే సంబంధిత అధికారులకు ఎంపిడిఓల దృష్టికి తీసుకు రావాలని, ఏమైనా ప్రతిపాదనలు వుంటే పంపించాలని వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజలకు త్రాగునీరు అందించడంలో ఎలాంటి సమస్య లేకుండా చూడాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులు పెండింగ్ వున్నచోట త్వరితగతిన పూర్తి చేయాలని. ఇందిరమ్మ ఇండ్ల ఎంక్వయిరీ త్వరితగతిన పూర్తి చేయాలని, పాఠశాలలో చదివే విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ కోసం ప్రభుత్వం నుండి డబ్బులు ఇస్తున్నారనిసాయంత్రంస్నాక్స్ విద్యార్థులకు తప్పనిసరిగా అంద చేయాలని ఆదేశించారు. దివ్యాంగులకు సదరం గుర్తింపుకు (యుడిఐడి) డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు స్వావ్‌లంబన్ జిఓవి.ఇన్‌లో, మీసేవ కేంద్రాల ద్వారావారు అప్లై చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఎంపిడిఓ లకు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పరిషత్ సీఈవో వెంకట్ రెడ్డి, డి.పి.ఓ పార్థ సారథి., డి.ఆర్.డి.ఓ నర్సింహులు, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా, ఈఈలు వెంకటరెడ్డి, పుల్లారావు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**భూత్పూర్, మార్చి5, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు వివిధ హోదాలలో తమ పాత్రలు నిర్వర్తించిపలువురిని మెప్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారిణి ఉషారాణి హాజరై విద్యార్థుల స్వయం పాలన నిర్వహణను చూపి వారిని అభినందించారు. కలెక్టర్‌గా ఆర్ హర్షిత, డీఈఓగా జె హర్షిత, హెచ్ఎంగా శ్రీవిద్య, ఎంఈఓగా చైత్ర చాలా చక్కగా అభినయించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారిణి ఉషారాణితో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఆనందమ్మ, ఎంఆర్పీ రాగూర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి, అంబుజా, జయంతి, సాయిరాంగౌడ్, పుష్పలత, మంజుల, కల్పలత, రాములు ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


అమిస్తాపూర్ యుపీఎస్‌లో విద్యార్థుల స్వయం పాలనలో పాల్గొన్న ఎంఈఓ